# ధైర్యం

**నేను నవ మన్మధుడిలా** ఉంటానని నేననుకోవడమే కాదు, కొందరాడపిల్లలనడమే కాదు—నా పరిచయస్థులో ని యీడు మగాళ్ళు కూడా ఒప్పుకున్నారు అటుపైన నాకు ఆడపిల్లలంటే భ్రమఉంది నాకు నచ్చిన ఆడపిల్లల్ని పట్లో వేసుకునేందుకు నా రూపం ఒక ఆయుధం. వీలు దొరికి నప్పుడల్లా అమ్మాయిలపై నేను పంజా విసురుతూనే ఉంటాను.

చాలా మందికి తెలియదు—ఆడపిల్లల్ని వశపర్చుకోవడం ఎంత సులభమో! వాళ్ళెంత అందగత్తెలో అంత అమాయకులు. పొగడ్తలకు, మంచి మాటలకు లొంగిపోతారు. మనం వాళ్ళను మోసం చేసినప్పుడు—మన అసహాయస్థితి గురించి కల్పించి కబుర్లతో శోకమ్మ కథ ఒకటి చెప్పుకుంటే—మనని క్షమించి వదిలి పెట్టేయడమే కాక జాలిపడతారు కూడ!

నాకులాగే చాలామంది యువకులకు అమ్మాయిలను వశపర్చుకోవాలన్న కోరిక అంతర్గతంగా ఉంటుంది. అయితే ముందడుగు వేయడానికి వాళ్ళకు ధైర్యం చాలదు. ఓ సారి నవ్వితే, ఓ మాట మట్లాడితే ఓ ప్రేమలేఖ రాస్తే ఆడపిల్ల లొంగి [illegible] చేయాలి. అందుకు ధైర్యం కావాలి.

వసుంధర

ఆ ధైర్యం నాకుంది.

ప్రస్తుతం నేను ఆఫీసు పని మీద విశాఖపట్నం వచ్చాను. దూరపు బంధువులింట్లో మకాం పెట్టాను. నా అదృష్టం కొద్దీ వాళ్ళు నేను వచ్చిన మర్నాడే ఇంటిల్లిపాదీ హైదరాబాదు వెళ్ళారు. నాకోసం ఓ గది తాళంగా ఉంచారు. ఇతర సదుపాయాలుండనే ఉన్నాయి. ఒక్క భోజనానికి మాత్రం హోటలుకు వెళ్ళాలి.

ఆఫీసు పని మీద నేను కనీసం రెండు వారాలుండాలి.

ఎదురింట్లో ఓ అందమైన యువతి ఉంది. ఆమె పేరు నాగేశ్వరి. వచ్చిన రోజునే ఆమెను చూశాను నేను. ఆ రాత్రే ఆమె గురించి తెలివిగా వాకబు చేశాను.

నాగేశ్వరికి రెండేళ్ళ క్రితం పెళ్ళయింది. కట్నం డబ్బు పూర్తిగా యివ్వలేదని, ఇతర మర్యాదలు సరిగ్గా జరగలేదని పెళ్ళిలో పెద్ద గొడవయింది. ఆ తర్వాత నాగేశ్వరి కాపురానికి వెళ్ళలేదు.

పైపైన ఆర్నెల్లకు నాగేశ్వరి భర్త ఇక్కడకు వచ్చాడు. తన తల్లిదండ్రులకు అన్నీ నచ్చచెప్పుకుంటానని కూతుర్ని కాపురానికి పంపమని నాగేశ్వరి తల్లిదండ్రులనడిగాడు.

ఈ కట్నం కోసం నీతల్లిదండ్రులు నా కూతుర్ని చంపేస్తారు. నిన్ననే నీతండ్రినుంచి ఉత్తరం వచ్చింది. ఆర్నెల్లలో కట్నం డబ్బులివ్వక పోతే విడాకులు తీసుకుందుకు సిద్ధంకమ్మని రాశాడాయన. అలాంటింటికి నాపిల్లనెలా పంపుతాను?" అన్నాడు నాగేశ్వరి తండ్రి.

"నేను హామీ యిస్తాను, మీ అమ్మాయిని నా ప్రాణానికి ప్రాణంగా చూసు



కుంటాను" అన్నాడు నాగేశ్వరి భర్త.

"ఇలాంటివి నాకు నచ్చవు. పిల్లను పంపాలంటే మీవాళ్ళు రావాలి. పెళ్ళిలో అసభ్యంగా ప్రవర్తించినందుకు మాకు క్షమార్పణ చెప్పుకోవాలి-" అన్నాడు నాగేశ్వరి తండ్రి.

నాగేశ్వరి భర్త వెళ్ళిపోయాడు. తల్లిదండ్రులు నాగేశ్వరికి భర్తకు, అత్తమామలకు వ్యతిరేకంగా నూరిపోస్తున్నారు. జరిగిన పెళ్ళిపెళ్ళి కాదనీ, ఆమెకు మరో పెళ్ళి అసాధ్యం కాదనీ, ఆమె చదువు కొనసాగించి ఉద్యోగం చేసి తన కాళ్ళ మీద తాను నిలబడాలనీ చెబుతున్నారు.

***నాగేశ్వరి భర్తకు భార్యంటే చెప్పలేని మోజుగుంది.*** అతను ట్రాన్స్‌ఫర్ అప్లికేషను పెట్టి మరో ఊరికి ఉద్యోగం మార్చుకుంటున్నాడు. తల్లిదండ్రులిప్పుడు తన పక్కలేరు కాబట్టి భార్యను కాపురానికి పంపమని కోరాడు.

"నీతలిదండ్రులు తమ పొరపాటును గుర్తించే వరకూ అమ్మాయి కాపురానికి రాదు-విడాకులంటే మాకు భయంలేదు" అన్నాడు నాగేశ్వరి తండ్రి.

కట్నం గురించి నాగేశ్వరి అత్తమామలు పట్టుదలగా ఉన్నారు. "కట్నానికి వ్యతిరేకంగా ఆదర్శాలు వల్లించేవారు-అసలు కట్నమిస్తానని ఎందుకు మోసం చేయాలి?" అన్నది వారివాదన.

పెద్దవారి పట్టింపుల మధ్య నలిగిపోతున్నాయి రెండు ప్రేమజీవులు. వాటిగురించి ఎవరికీ అవసరంలేదు.

నాగేశ్వరి కథవినగానే నాలో ఉత్సాహం వచ్చింది. ఇలాంటి పిల్లను పెళ్లి చేసుకోవడం చాలా సులభం. ఒక్కటి రెండు అవకాశాలు కలిసి రావాలి. అటుపైన చొరవ ఉండాలి.

మొదటి అవకాశం మర్నాడే నాబంధువు టెలిగ్రాం కారణంగా ఇంటిల్లిపాదీ హైదరాబాదు తరలి వెళ్ళడం.

రెండవ అవకాశం-ఆసాయంత్రం నాగేశ్వరి మాయింటికి రావడం. మావాళ్ళూరికి వెళ్ళినట్లామెకు నిజంగా తెలియదో-లేక నాకోసం వచ్చిందో తెలియదు. కానీ నన్నుచూసి కంగారు పడి వెళ్ళిపోతుంటే నేను మాటలతో ఆపాను. నన్ను నేను పరిచయం చేసుకున్నాను. ఆమెను గురించి అడిగాను.

"మీరు మాచెల్లాయి గురించి వచ్చి ఉండొచ్చు-కానీ నాతోకాసేపు మాట్లాడకూడదా?" అన్నాను చనువుగా.

ఆమె మొహమాట పడి ఆగింది. అలాంటి మొహమాటమేమున్నందు ఇంకా బాగా ఉపయోగించుకోవాలనుకున్నాను.

ముందామెకు నాఉద్యోగం గురించి చెప్పాను. ఈరోజు మధ్యాహ్నంతర్వాత పనిలేక ఇంటికి వచ్చేశాను.

"నాకు మనుషులు కావాలి. కబుర్లుండాలి. బోరుకొట్టేస్తూంటే మీరొచ్చారు. మిమ్మల్ని మంచి స్నేహితురాలిగా భావించాను. తప్పితే ఆడపిల్లన్న ధ్యాసేలేదు నాకు. నావన్నీ ఆధునిక భావాలు. మన మనసుల్లో ఉండే కల్మషం స్త్రీపురుషుల నొకరినొకరికి దూరంగా ఉంచుతుంది. ఏం? ఇద్దరు స్నేహితుల్లా మనం సమకాలీన సమాజం గురించి, అమెరికాధిపత్యాలగురించి, రాజీవ్‌గాంధీ గురించి, ఇండియన్ క్రికెటర్ల గురించి మాట్లాడుకోకూడదా?....నాకు మీరెంతో నచ్చారు. అరమరికలు లేకుండా ఆగమనగానే ఆగారు అందరూ మీలాగే ఉండాలి. రోజూ

కాసేపిలాగే కాసేపు కంపెనీ యిస్తే సంతోషిస్తాను-" అని ఆమెకు చెప్పాను. అప్పుడామె కళ్ళలో మెరుపు కనిపించింది. అబద్ధమెందుకూ-అప్పుడు నాదృష్టి మాత్రం ఆమె అందచందాల మీదే ఉంది.

ఎన్ని కబుర్లు చెప్పండి-మగాడికి ఆడదెప్పుడూ ఆడదే!

ఆ తర్వాత నా ఆశయాల గురించి చెప్పాను. స్త్రీని సమాజం చిన్న చూపు చూస్తోందనీ-స్త్రీని గౌరవించని సమాజానికి విలువ లేదనీ అన్నాను.

ఆమెకూడా నాతో మగవారికి వ్యతిరేకంగా ఎన్నో మాట్లాడింది.

"మీరు చెప్పేది నిజం. మీ ముందు మగవాళ్ళ తరఫున సిగ్గుతో తలవంచుకుంటున్నాను-" అన్నాను.

"అయ్యో! నేను మీగురించి అనడం లేదు-" అందామె నొచ్చుకుంటూ.

"మీరన్నా అనకపోయినా పురుషుడు స్త్రీని బానిసలా చూస్తున్నాడు. నేనూ అందువల్ల ప్రయోజనాలుపొందుతున్నాను తప్పితే నిరసించడం లేదు-" అన్నాను.

అప్పుడామె నన్ను పొగిడింది.

తన్ను పొగిడినప్పుడు, తన అభిప్రాయాలతో ఏకీభవించినప్పుడు ఎదుటివ్యక్తి స్త్రీకి మరో పురుషుడిలా గోచరిస్తాడు. ఒక్కోసారి ఆమె మదిలో అటువంటి ...సం ...పాదించ గలిగాకుంటే ఆమె ...ర్తిగా మనకు దక్కినట్లే!

ఆరోజుతో మాపరిచయం ఆగిపోలేదు ఇంట్లో కలుసుకుంటే బాగుండదని ...బీచి వద్ద కలుసుకునే వాళ్ళం. ...న్నో కబుర్లు చెప్పుకున్నాం.

ఆమె నాకు తన కథ చెప్పుకుంది.

"ఈపరిస్థితిల్లో ఏంచేయాలో నాకు తెలియడం లేదు. విడాకులు తీసుకొని మళ్ళీ పెళ్ళిచేద్దామని నాన్నఉద్దేశ్యం. మన సమాజమింకా అదశకు ఎదగలేదని నా అభిప్రాయం-" అందామె.

ఆమె కనులలోని విషాదాన్నికానీ, గొంతులోని ఆవేదనను కానీ నేనర్థం చేసుకుందామని ప్రయత్నించలేదు. వచ్చిన అవకాశాన్ని వదులుకోకూడదన్నదే నా ధ్యాసం.

"మీరు అందంలో, తెలివిలో-అద్భుత యువతి. మీవంటి యువతిని వదులుకోవాలనుకునే వారు స్వార్థంతో కళ్ళుమూసుకుని పోయుండాలి. నేను మీకు సాయపడగలను. కానీ మీకు ధైర్య ముండాలి ......." అన్నాను.

"అంటే"? అందామె

"జరిగిన పెళ్ళిజరుగులేదనుకోండి ..
......" అని ఆగాను.

"అయితే?"

"నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటాను......"


ఆమె తెల్లబోయింది.

నేనామెకు నాప్రేమ గురించి చెప్పుకున్నాను. ఆమె కోసం ఏమైనా చేయగలనన్నాను. నేనామెకు తగనివాడినని తెలిసినా-ఈ సమాజం స్త్రీపై విధించిన ఆంక్షల కారణాంగా-ఆమెకు నాప్రేమ గురించి చెప్పగల సాహసం చేశానన్నాను.

ఆమె నొచ్చుకొని-అలాగన అం... నేను మీకు తగను-అంది.

ఆ మాత్రం మాట అన్నదంటే-ఆమె నాదారికి వచ్చిందనే అర్థం.

"మీఅర్హత నాకు తెలుసు. మన పెళ్ళి మీ కిష్టమేనా?" అన్నాను.




"నాకు పెళ్ళి అయిపోయింది. ఇంకో పెళ్ళి ఎలా సాధ్యం?" అందామె.

"చాలా సింపుల్! మీకు పెళ్ళి అయిపోయినది కాబట్టి మీరు ఇల్లు వదిలి వచ్చేస్తే భర్తతో కాపురానికి వెళ్ళావనే అంతా అనుకుంటారు..............."

"కానీ అమ్మా, నాన్నా........"

"సినిమాకు వెడుతున్నానని ఇంట్లో బయలుద్దేరండి. వాళ్ళు చదువుకుండుకు వీలుగా ఓ ఉత్తరం ఇంట్లో ఉంచండి. అందులో మీరు భర్త వద్దకు వెళ్ళి పోతున్నట్లు రాయండి. వాళ్ళూ ఇంక మాట్లాడరు. మనం కలిసి కాపురం ప్రారంభించక మీభర్త మాత్రం ఏం చేస్తాడు? మీ పెళ్ళికి లిఖిత పూర్వక సాక్ష్యం లేకపోలేదు మనం మాటల్లో రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి చేసుకుందాం. ఆ తర్వాత అంతా ఆశీర్వదిస్తారు.............."

నాగేశ్వరి ఆలోచనలో పడింది.

"జీవితంలో మీరు తీసుకోబోయే అతి క్లిష్టమైన నిర్ణయమిది. కానీ ఇందువల్ల మన యిరువురి జీవితాలలోకి వెలుగు వస్తుంది—" అన్నాన్నేను.

నాగేశ్వరి ఆరోజుకు సెలవు తీసుకుంది

మర్నాడు నా బంధువులంతా వచ్చేశారు. నాగేశ్వరి నిర్ణయం కోసం నేనుచాలా ఆత్రుతగా ఉన్నాను. ఆమె రావడానికి అంగీకరిస్తే ముందుగా ఏం చేయాలన్నది నా ఆలోచన!

నా భార్య పురిటికి వెళ్ళింది. పురుడు రావడానికింకా ఆరువారాలు వ్యవధి. అటు పైన మరో మూడునెలలవరకూ ఆమెరాదు. సుమారు నాలుగు నెలలుపాటు నన్నడిగే వారు లేరు. అయితే నాగేశ్వరిని నా యింటికి తీసుకుని వెళ్ళలేను. చుట్టుపక్కాల వాళ్ళు అనుమానిస్తారు. ముందుగా ఆఫీసుకు సిక్ లీవ్ కావాలని టెలిగ్రాం పంపాలి. అటుపైన నాగేశ్వరిని తీసుకుని మరో ఊరు వెళ్ళాలి.

-ఏదో ఊరెందుకు? తిరుపతి వెడితే...

తిరుపతి రావడానికి నాగేశ్వరి కూడా అంగీకరిస్తుంది.

కొన్నాళ్ళపాటు ఆమెతో సరదాగా చలాకీగా గడిపివేశాక-ఓరోజున గుట్టు చప్పుడు కాకుండా ఆమెను వదిలి వెళ్ళిపోవడం_ఆఫీసులో జాయినవడం. ఆ తర్వాత అరాలు తీసుకుంటూ నాగేశ్వరి వచ్చినా-నన్నేం చేయగలదు?

భర్త ఉండగా మరోడితో కాపురం చేస్తున్న స్త్రీని సమాజం హర్షించదు.

సమాజంవల్ల ప్రయోజనాలు పొందుతున్న పురుషుల్లో నేనొకణ్ణి.

ఒరోజు నాగేశ్వరి నన్ను బీచి వద్ద కలుసుకుంది.

"నీతో వచ్చేస్తున్నాను......"అందామె.

ఒక్కసారి వేయివీణలు మ్రోగినట్లు వినిపించింది. అప్పటికప్పుడు- అంత మందిలో ఆమెను కౌగలించుకోవాలనిపించింది. కానీ నిగ్రహించుకొన్నాను.

"అయితే మనమిద్దరం ముందుగా తిరుపతి వెడదాం. ఆశ్రీనివాసుడి దీవెన అందుకుందాం-"అన్నాను.

నాగేశ్వరి అంగీకరించింది.

టికెట్లు నేనే బుక్ చేసాను. సరిగ్గా ఆపరోజుంది ప్రయాణానికి. ఆ తర్వాత కొన్నాళ్ళు.........

నాగేశ్వరిని చూస్తుంటే నాకు జాలి వేసు. నేనామెలో మనిషిని చూడ్డంలేదు. స్త్రీని చూస్తున్నాను. అదినాకు కొత్తకాదు. మనసులో జాలివున్నవాడు సుఖపడలేడు. స్త్రీని స్త్రీగా కాక మనిషిగా చూసేవాడికి సుఖముండదు. స్త్రీని స్త్రీగాకాక మనిషిగా చూసేవాడామెను కష్టపెట్టలేడు.

నాకావలసిందామె కష్టపడకపోవడం కాదు. నాసుఖం!

నేను టికెట్లు బుక్ చేసానని తెలిసేక నాగేశ్వరి-"మన మిక కలుసుకోవద్దు... అంది.

అది నిజమే! ఎవరికీ అనుమానం రాకూడదు..........

మనసు కాలమాగిందని భ్రమ పడుతుంది కానీ కాలమెప్పుడూ ఆగదు. చూస్తూండగా మా ప్రయాణం రోజు వచ్చింది.

నేను బంధువులింట్లో సెలవుతీసుకుని స్టేషనుకు వెళ్ళి ట్రయినెక్కాను. ట్రయిన్లో కూర్చుని నాగేశ్వరి కోసం ఎదురుచూస్తున్నాను.

నాగేశ్వరి వస్తుందా?

ఆమెవస్తుందనే నామనసు చెబుతోంది.

నానవమన్మథరూపం, అంతకు మించిన పూలబాణాలు నామాటలు!

ఆమెస్త్రీ! నాలో పురుషుడిని చూడకుండా ఉండగలదా!

నేనాలోచిస్తూండ గానే నాగేశ్వరి వచ్చింది.

కట్టుబట్టలతో వచ్చేసిందామె.

అవును మరి-సూట్ కేసుతో బయల్దేరలేదుగదా'ఇంట్లో అనుమానిస్తారు......

ఎంత ధైర్యం-ఆడదానికి?

ఆధైర్యానికి కారణం-"ఆమెకు నాపై ఏర్పడిన నమ్మకం...

నాగేశ్వరి ముఖం నిర్మలంగా ఉంది. ఆమె కనులలో భయం లేదు. తప్పుచేస్తున్నానన్న భావనలేదు.

ఈ నాగేశ్వరి నాచేమోసగించ బడ్డాక ఏమవుతుంది?


"ఆలోచించకు....అంది మనసు.

వెంటనే మనసు చెప్పినట్లు విన్నాను.

అది తిరుపతి వెళ్ళే స్పెషల్ ట్రైన్. రాత్రి ఎనిమిది గంటలకు స్టేషను వదిలిపెట్టింది.

మేమిద్దరమూ ఎక్కువగా మాట్లాడ కోలేదు.

నాగేశ్వరి వెంటనే నిద్రలో పడింది. నాకు నిద్రపట్టలేదు.




నామనసు రకరకాల భావాలమధ్య ఊగిసలాడుతోంది. ఎందరో ఆడపిల్లల్ని మోసం చేశాను గానీ వాళ్ళను గాలికి వదలిపెట్టలేదు. కల్లబొల్లికబుర్లతో వాళ్ళ మనసులో కరిగించి తప్పించుకొన్నాను.

జీవితంపై ఎన్నో ఆశలతో, కొత్త కోరికలతో-పూర్తిగా నన్ను నమ్ముకొని నాగేశ్వరి యిల్లు వదలిపెట్టింది. ఇకమీదట ఆమెకు అటు తల్లిదండ్రులు, ఇటు భర్తకూడ ఆశ్రయమివ్వరు.

“ఇది చాలా దుర్మార్గం-” అంటోంది అంతరాత్మ.

“ఆలోచించకు-” అంటోంది స్వార్థం.

ఎప్పుడో చిన్నకునుకు పట్టింది. అందులో ఓకల. ఆకలలో నాగేశ్వరి ఆత్మహత్య చేసుకుంది.

ఉలిక్కి పడిలేచాను.

అప్పుడే నాగేశ్వరి కూడా లేచింది నన్ను చూసి - “బెజవాడొచ్చినట్టుంది-” అంది.

నేను బయటకు చూసి-“అవును”- అన్నాను.

ఆమె అందం నన్ను మళ్ళీ మోహం లోపడవేస్తోంది. ఆమోహంలో నాలో స్వార్థాన్ని రేపుతోంది.

ట్రయిన్లో ఇద్దరు మంచి స్నేహితుల్లా మసిలాం. అయితే చాలా మంది మమ్మల్ని భార్యాభర్తలనే అనుకొన్నారు. ఓ బామ్మగారయితే-“చక్కనిజంట-” అనిమమ్మల్ని మెచ్చుకొంది.

నాగేశ్వరి అభ్యంతరపెట్టలేదు. సిగ్గుపడింది.

“తిరుపతి ప్రయాణం దేనికి? పిల్లల కోసం మొక్కుకొన్నారా” అందా బామ్మగారు ముసిముసిగా నవ్వుతూ.

“శ్రీనివాసుని దీవెనలకోసం-” అంది నాగేశ్వరి.

నేనులిక్కిపడ్డాను. ఆమె నన్ను పూర్తిగా నమ్మింది.

దైవసాన్నిధ్యంలో నేనామెను మోసం చేయాలనుకుంటున్నాను. నన్ను దేవుడు కూడా క్షమించడు.

"దేవుడు లేడు. ఆ మనిషి కల్పించుకున్న భ్రమ-" అంది స్వార్థం.

నా స్వార్థం ఎంతో మంచిది.

ప్రయాణంలో నాగేశ్వరి పక్కనుంటే యుగాలలో క్షణాలలో గడిచిపోయాయి. తిరుపతి వచ్చేసింది.

తిరుపతిలో దిగేం. ప్రారంభమవుతాయి నాఖర్చులు. కట్టుబట్టలతో వచ్చేసిందామె. ఆమెకు బట్టలు కొనాలి...

ఇద్దరం ట్రయిన్ దిగి గేటువైపున నడిచాం.

అప్పుడో యువకుడు మాకు ఎదురొచ్చాడు. నాగేశ్వరిని చూస్తూనే "-నాగేశ్వరీ!" అన్నాడు.

ఆమె చటుక్కున అతడివైపు నడిచి -"వచ్చారా!" అంది.

"నీ టెలిగ్రాం-ఉత్తరం రెండు అందాయి. రాకుండా ఎలా ఉంటాను. నీ స్నేహితురాలింటికి నేనిచ్చిన టెలిగ్రాం అందలేదా?" అన్నాడతను.

"అందింది కానీ నా ధైర్యానికి అసలు కారణం అదికాదు. ఈయన..." అంటూ ఆమె నన్ను చూపించింది.

నేను తెల్లబోయాను.


"నీ దగ్గరకు వచ్చేయాలని ఉంది నాకు కానీ నాతల్లిదండ్రుల నెదిరించి రాలేక పోతున్నాను. ఆ ధైర్యం ఈయనే ఇచ్చాడు..." అంది నాగేశ్వరి మళ్ళీ.

నేను ధైర్యం చేసానని అనుకున్నాను ఆమెను మోసగించడానికి! నా మోసం ఆమెకర్థమయిందో లేదో తెలియదు. కానీ ఆమె కనులలో - "నాతో లేచి వచ్చేయ్ - అని నావద్ద అనగల ధైర్యం ఏమగాడికీ ఉండకూడదంటే నేను నా భర్తతో ఉండక తప్పదన్న పరమ సత్యం నువ్వే చెప్పావ్. అదే నాలో ధైర్యాన్ని పెంచింది. నన్ను ప్రేమించే భర్త ఉండగా-పరాయి మగాడితో ఎందుకు లేచిపోవాలి! భర్తతో లేచిపోవచ్చుగా..." అన్న సందేశం నాకు అనిపించింది.

ఆ యువకుడు వెంటనే -"నాగేశ్వరీ మనల్నిద్దర్నీ కలిపిన ఈయనే మనకు శ్రీనివాసుని మించిన దేవుడు. పాదాభి వందనంచేయి-" అన్నాడు.

ఇద్దరూ నాకు పాదాభి వందనం చేశారు.

అంతకు మించిన శిక్షనాకు అవసరం లేదు నన్నెంతగానో అభిమానిస్తున్న ఆ దంపతులు ఆతర్వాత ముందెప్పుడూ నా ఉనికి గురించి తెలియకుండా కాపాడుకోవడం ఎలాగో ఆలోచిస్తున్నాను......*



వీరు ..శ్రీ విక్రమశాస్త్రిగారని... త్రీడీ సినిమాల్లో వేస్తుంటారు...